# ఆదిత్య హృదయం

అపర్ణ

"అమ్మ ఎప్పుడొస్తుంది, నాన్నా?!"

తన ప్రతిరూపం. తన రక్తం. తన సృష్టి. ముక్కు పచ్చలారని పసితనం. యుద్ధం రోజుల్లో తనతో పాటు పని చేస్తూ ప్రాణాలు కోల్పోయిన సిపాయి మిత్రుడి స్మృతిగా పెట్టుకున్న పేరు— మధు!

చేతుల నడుమ విడదీసిన దినపత్రిక ముడిచి టీపాయి మీద పడేశాడు శైలు సూపరింటెండెంట్ ఆదిత్య.

తనకు తెలుసా ఎప్పుడొస్తుందో? అసలొస్తుందా? వచ్చేట్లయితే వెళ్ళడం ఎందుకు?

ధర్మేచా అర్థేచా కామేచా మోక్షేచా నాతి చరామి — ఏది జీలకర్రో, ఏదిబెల్లమో వేరు చేయలేనట్లు దాంపత్యంలో సంలీనం అయిపోవాలని, తలమీద అనగా వల్లించుకున్న ప్రమాణాలు... సప్తపది దీవెనలు గాలికి పేలపిండివలె అయిపోయాయి.

తను వూహించలేకపోయాడు— ఆ పచ్చతోరణాల పందిట్లో ముహూర్తం వేళ తనెంత జాగ్రత్తగా మెట్టినా, ఆ తల కది అంటకుండా నేలరాలిన దాని పర్యవసానం ఇంత దారుణమని?!

తను కవి కాదు. గాయకుడు కాదు. కళాకారుడు కాదు. ఒక సామాన్యమైన మనిషిగా గుట్టుగా, గౌరవంగా, శాంతిగా, సుఖంగా జీవించడానికి తగడా?

తన జీవితంలో డైనమైట్ పేలిన ఆ రాత్రి, చేసుకున్న బాసలకు, ప్రోది చేసుకున్న నమ్మకాలకు చెదలు పట్టిన రాత్రి — తన గుండె కాలిపోయింది. సిగ్గుతో చచ్చిపోయాడు!

ఎంత పని చేశావు శ...కుం... త...లా? ఏం లోటు చేశాను? నీ అభిరుచులని, అభిలాషల్ని ప్రేమించి స్వేచ్ఛ ఇచ్చినందుకు నా బతుకు కుక్కలు చింపిన విస్తరి చేశావ్. అంతకంటే చాచి దవడ మీద కొట్టినా కిక్కురుమనే వాణ్ణి కాదే?!

బతుకు మీద కొట్టావ్, శకుంతలా... నీ పేరు సార్థకం చేసుకున్నావ్. నువ్వు పక్షివి. నీకు నిలకడ లేదు. అందుకే ఎగిరిపోయావ్... నేనే మోసపోయాను—కణ్వుడి శకుంతలవని భ్రమసి!

మరు జన్మంటూ ఉంటే శాపంలా ఇంతకింత అనుభవి... వద్దు! వద్దు! కసి, ప్రతీకారం తన ధ్యేయం కాకూడదు! దానికి మరో జన్మ పొడిగింపు... వద్దు, వద్దు.

శకుంతలా.. ఆ పేరు గూడా తల్చుకో కూడదు! అదంతా వో పీడకల! అంతే!

"మాట్లాడవేం, నాన్నా? అప్పుడెప్పుడో జేజి పంపిస్తాడని చెప్పేవ్ పెద్ద..."

"వస్తుంది, కన్నా! తప్పక వస్తుంది."

ఒళ్ళో చేరిన మధు తల మీద లాలనగా నిమురుతూ, జుత్తు సవరిస్తూ ఉండిపోయాడు ఆదిత్య.

ఒక వేళ నిజంగా వస్తే?!... హుం. తన బతుకు రచ్చ బండచేసి...నో!నో! తను ఎంగిలి ముట్టడు.

"ఎప్పుడూ అట్లాగే అంటావు. అక్కయ్య కూడా అంతే... అసలు నీ తట్టు టే!..."

ఒళ్ళో గిర్రున తిరిగి చటుక్కున తండ్రి కళ్ళజోడు లాగేశాడు బుంగమూతితో మధు.

"తప్పమ్మా... నాన్నగార్ని గొడవ పెట్టకూడదు."

బుజ్జగింపుగా తండ్రి ఒళ్ళోంచి మారాం చేస్తున్న తమ్ముణ్ణి తీసుకుంది కాదంబరి.

"ఫర్వాలేదమ్మా— అడక్కూడనిది అడగలేదుగా?!"

ఎందుకో తనకి తెలీకుండానే గొంతు గద్గదమయింది ఆదిత్యకి.

"కాఫీ చల్లారి పోతూంది. తీసుకోండి. నాన్నా!"

చీకటి మాటున చిదిమితే శతకోటి దీపాలయ్యే చిన్నారి కాదంబరికి ఎంత ఆర్థిందాతనం? అచ్చటా ముచ్చటా ఏమీ తీర్చలేని బతుకు శాపాన్ని వరించిన ఈ తండ్రిని క్షమించగలవా, అమ్మా?

ఆదిత్య మనసు తల్లడిల్లి పోయింది.

"జీప్ వచ్చింది, నాన్నా!"

సోఫాలోంచి లేచి వెళ్ళి అద్దం ముందు యూనిఫామ్ సరి చేసుకుంటున్న తండ్రికేసి చూస్తూ పలికింది కాదంబరి.

"వెళ్ళొస్తానమ్మా!"

కూతురు బుగ్గల్ని వాత్సల్యంగా పుణికి, చూపుడు వేలుతో మీసాలు అద్దుకుంటూ వాకిట్లోకి నడిచాడు ఆదిత్య.

"టాటా చెప్పమ్మా నాన్నగారికి..."

మధు నెత్తుకుని, వాడి చిట్టి చేతుల్ని తనచేతిలోకి తీసుకుని జీప్‌లో కూచున్న తండ్రికేసి వూగించింది కాదంబరి.

• • • •

"నీ తోబుట్టువు లాంటి దాన్ననుకొని నాతో మాట్లాడాలి. సరేనా?!... నీ పేరేమిటి?"

"పంకజం."

"ఏం చదూకున్నావు?"

"డిటెక్టివ్ పుస్తకాలు .. సినిమా పత్రికలు... సీరియల్ నవలలూ..."

"అవి కాదమ్మా! స్కూలు, కాలేజీ అలాటి వాటిల్లో ఎంత దాకా చదూకున్నావని?!"

"పదో క్లాసు పాసయ్యాను. ఇంటర్మీడియేట్ సగంలో ఆపేయాల్సొచ్చింది."

"మీరెంతమంది?"

"మా అమ్మకు నలుగురు ఆడపిల్లలం. నేనే పెద్ద. మాకు ఇద్దరు తమ్ముళ్ళు."

"మీ నాన్నగారేం చేస్తుంటారు?"

"మాది మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబం. మా నాన్న ప్లీడరు గుమాస్తా. పాతకాలపు పెంకుటిల్లొకటుంది సొంతానికి."

"పూ... మరి నువ్విక్కడికి ఇలా రావడానికి దారి తీసిన పరిస్థితులు చెప్పగలవా?"

మౌనం.

"ఫరవాలేదు. సిగ్గు పడాల్సిందేమీ లేదు. దాపరికం లేకుండా ధైర్యంగా చెప్పు. నీకు ఒక అక్కయ్యే ఉంటే, గడ్డం పుచ్చుకుని బతిమాలుతుంటే కాదనగలవా?"

తటాపటాయించి... తటాపటాయించి —

"నే మోసపోయానండీ! మోసపోయాను!" బావురుమంది.

"పంకజం! నిన్నే... ఇలా చూడు. ముందు కళ్ళు తుడుచుకో! ఆడపిల్ల అలా ఏడవడం శ్రేయస్సు కాదమ్మా! జీవితంలో తప్పులు చెయ్యని వాళ్ళు ఎవరూ లేరు. మనల్ని సృష్టించిన భగవంతుడు కూడా అభాగ్యుల మీదనే అపారమైన కరుణ చూపిస్తాడు. అయినా నువ్వేం నేరం చేశావని? నీ అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని దగా చేసిన వాళ్ళు నీ ఉసురు పోసుకుని ఎప్పటికైనా పాపఫలం అనుభవిస్తారు."

ఎక్కిళ్ళు వెనుబట్టాయి.

"చదువు అబ్బని మా తమ్ముడు పుస్తకాలు, పత్రికలు అద్దె కిచ్చే కొట్టు మా ఇంటి పంచలో పెట్టాడు. చాలమంది లానే ఒకతను వస్తుండేవాడు. ఎప్పుడయినా నేను కూడా కూర్చుని పద్దులు చూస్తుండేదాన్ని. పుస్తకాలు ఇచ్చి పుచ్చుకోడం, పద్దులు చూడ్డం అలా అలా మాకు పరిచయం ఏర్పడింది. ఏవేవో మాట్లాడుతుండేవాడు. నవ్వించేవాడు. తమాషా తమాషా సంగతులు చెపుతుండేవాడు. ఆ మాటలే, ఆ యెకసెక్కాలే నా జీవితంలో నిప్పులు పోశాయి."

"వాడుక మాటల్లో చెప్పాలంటే ప్రేమించుకున్నా రన్నమాట!"

శబ్దం చెయ్యాలని సమాధానం.

"వూ... ఎందు కతన్ని ప్రేమించాలనిపించింది?"

"చూడ్డానికి బాగానే ఉంటాడు. ఏదో ఉద్యోగం చేస్తున్నట్లు చెప్పాడు. నా కోసం తను మాంసం తినడం, సిగరెట్లు కాల్చడం మానేస్తానని ఒట్టు పెట్టాడు. . మా తల్లిదండ్రులు నాకు కట్నాలు పోసి పెళ్ళిళ్ళు చెయ్యలేరని తెలుసు. కనీసం ఒక పిల్ల భారం తగ్గినా తగ్గినట్లేనని... ఏ ఆడపిల్లకైనా ఉండే ఆశే మగతోడు కోసం... కాకపోతే నా ఖర్మ ఇలా కాలింది!"

అరచేత్తో నుదురు మీద పదేపదే కొట్టుకున్న చప్పడి.

"మీ తల్లిదండ్రులతో చెప్ప లేక పోయావు?"

"అతనిది మా కులం కాదు. డబ్బు లేకపోయినా పట్టింపులకేం తక్కువ లేదు. మా కుటుంబాల్లో మా వాళ్ళకి తెలిస్తే చించి సీసం పోస్తారు."

"పెళ్ళి చేసుకుంటానని చెప్పాడా అతను?"

"చేతిలో చెయ్యి వేశాడు. వాళ్ళ అక్క ఆశీర్వాదం తీసుకుని పెళ్ళి చేసుకుందామన్నాడు. అంతా అయిపోయాక మా తల్లిదండ్రుల్లో కూడా తప్పక మార్పు వస్తుందని చెప్పాడు. ఇద్దరు పిల్లలు చాలన్నాడు. వేన్నీళ్ళకు చన్నీళ్ళకు నాకూ ఒక చిన్న ఉద్యోగం చూద్దామన్నాడు. నన్ను నమ్మకం అనే నట్టేట్లో ముంచి దిక్కుమాలిన దాన్ని చేశాడు, బాబూ!..."

లబ్బున కొట్టుకుంది.

"ఏమిటీ అతను చేసిన మోసం?"

"జరిగిన విషయమంతా ఒక కాగితం మీద రాసి మా అమ్మ తలగడ కింద పెట్టి... అమ్మా!..."

ఎలుగెత్తి అరవు అరచిన వెంట పొగిలి పొగిలి దుఃఖం. కంఠం రుద్ధమైపోయింది.

"అతనితో ఆ రాత్రి బయలుదేరి వెళ్ళాను. వూరి పేరు బాగా గుర్తు లేదు. ఆ వూళ్ళో దిగాక హోటల్లో టిఫిన్ తినిపించి రిక్షాలో వాళ్ళక్క గారి ఇంటికని తీసుకెళ్ళాడు. అక్కడ ఒక నడివయసామె నన్ను ప్రేమగా ఇంట్లోకి తీసు కెళ్ళింది. బెంగ, భయం లేకుండా ఉండమంది. స్నానం అదీ చేసి భోజనాలు అయ్యాక బడలిక అనిపించి నిద్రపోయాను. మెలుకువ వచ్చి చూసేసరికి అతను లేడు. అంతే. అతనిక రాలేదు!" చెప్పడం ఆపి, అలుపుగా అనిపించి శ్వాస తీసుకుంది.


"నిన్ను అతను పెళ్ళి చేసుకోలేదా?"

"మా వూరు వదిలే ముందు నేనే వూరి బయట గంగానమ్మ గుడి వాకిట్లో అతని చేత పసుపు కొమ్ము కట్టించుకున్నాను. ఈ జైలు కొచ్చే ముందు తెంపి ముక్కలు చేసి మురిక్కాలవలో కొట్టాను. ఒక్క విషయం—అతను నన్ను ముట్టుకోలేదు."

"అతను నిన్ను దగా చేసినట్లు ఎలా గుర్తించావు?"

"రెండు రోజులు దాటిపోయినా అతను కనబడక పోయేసరికి నాకు భయం వేసింది. ఆ తరవాత తెలిసింది— తన అక్కని చెప్పిన ఆ నడివయసు






ఆడదానికి నన్ను వెయ్యి రూపాయలకు అమ్మి ఆ సొమ్ముతో ఉడాయించాడని. ఆ లుచ్చా ఎక్కడైనా కనిపిస్తే కత్తిపెట్టి పొడిచి ... పొడిచి నెత్తురు వరదలు కట్టాలి!'' పళ్ళు పటపట కొరికింది.

''వూ. ఆ తరవాత?''

''తెలిసింది అది చెడు కొంపని. గుండె పగిలి పోయింది. నన్ను బలవంత పెట్టారు. కొట్టారు. వినరాని పచ్చి బూతులు తిట్టారు. మొహం మీద ఉమ్మేశారు. జడ కొసలు కత్తిరించారు. ఇంకా మొండి కేస్తే గుండు గీయిస్తామన్నారు. జాకెట్టు చించారు. చీర విప్పి లంగా మీద మిడ మిడ కాలే ఎండలో రాతి బండమీద అన్నం నీళ్ళు ఇవ్వకుండా రోజంతా నించబెట్టారు. అమానుషంగా హింసించారు. చచ్చి పోయిన మా అమ్మమ్మ నా చేతికి తొడిగిన ఉంగరం తీసిచ్చి, నన్నొదిలి పెట్టమని కాళ్ళా వేళ్ళా పడ్డాను. గొంతు పగిలేలా అరిచి కేకలు పెట్టాను, కామ కృత్యాలు తీర్చుకోడానికి అడ్డం పడితే, నా ఉంగరం కాజేశారు. చెప్పినట్లు వినకపోతే వూళ్ళో అడుక్కుతినే కుష్టువాడ్ని తీసుకొచ్చి చెరిపిస్తామన్నారు.''

గుండె అవిసేలా రోదన! రోదన! భగ్గున ఎగిసిన బడబాగ్ని లాటి ఎడతెగని దుఃఖం! దుఃఖం! చరాచరా ప్రకృతి చలించి పోయేలా ధారాపాతంగా శోకం! శోకం!

''బాస్టర్డ్స్!'' గది గోడ అదిరేలా పిడికిళ్ళు బిగించి చేంబరులో ప్రతిధ్వనించాడు కర్కశంగా ఆదిత్య.

''ఎంతో నిగ్రహంతో వ్యవహరించ వలసిన జర్నలిస్ట్‌నై ఉండికూడా నాకే రక్తం ఉడికిపోయింది!''

అంది జర్నలిస్ట్ భారతి, టేప్ రికార్డర్‌లో కేసెట్ రెండో వైపు అమరుస్తూ.

''రెండు వారాలు గడిచాయి. బలవంతంగా సారాయి తాగించారు. వాళ్ళే గెలిచారు. ఒక రోజు మఫీలో ఒక పోలీస్ కానిస్టేబుల్ వచ్చాడు. అప్పుడు పక్కనున్న పెద్ద టౌన్లో ఒక లాడ్జింగ్ హోనరు నన్ను కొనుక్కోవడానికి వచ్చి ఉన్నాడు. మూడు వేలకు బేరసారాలు జరుగుతున్నాయి. అరెస్టు చేసి తీసుకెళ్ళారు. వాళ్ళు మరి ఎలా తప్పించుకున్నారో, యేమో స్టేషన్లో మరునాడు కనిపించ లేదు. అక్కడ ఇన్‌స్పెక్టర్‌తో, కానిస్టేబుళ్ళతో నా గోడ వంతా చెప్పుకుని ఏడిచాను. వాళ్ళ కెందుకో నమ్మకం కలగలేదు. పైగా విసుక్కున్నారు. కోర్టులో హాజరు పెట్టారు. ఏవేవో ప్రశ్నలు వేశారు. నాకు తోచిన జవాబులు చెప్పాను. పాతిక రూపాయలు జరిమానా కట్టమన్నారు. నా దగ్గర లేవన్నాను. పది రోజులు జైలుశిక్ష ఖాయం చేసి ఇక్కడికి తెచ్చారు. భగవంతుడు ఏ ఆడపిల్లకీ నాకిచ్చిన ధైర్యాన్ని, తెగువని, గుడ్డి నమ్మకాన్ని ఇవ్వకూడదని శత కోటి ప్రార్థనలు చేస్తున్నానండీ!''

సంభాషణకి విరామ బిందువు పడింది.

చాలా క్షణాలు కఠోరమైన మౌనం రాజ్యం చేసింది.

టేప్ తిరగడం ఆగిపోయింది.

''దీన్లో మీ కభ్యంతరం ఉన్న భాగాలు చెబితే— మీ రిచ్చిన అనుమతి దుర్వినియోగం చేయలేదనే.''

వాక్యాలు పూర్తి చేయకుండానే డైరీ తెరిచి పెన్ తీసి పట్టుకుంది భారతి — ఆదిత్య కేసి పరిశీలనగా చూస్తూ.

''నథింగ్!''

''థాంక్యూ!''

భారతి కళ్ళు కృతజ్ఞతగా మెరిశాయి.

''బహుశా మీ పని పూర్తయిందని ఆశిస్తాను.''

కొద్ది క్షణాలు తాళి కుర్చీలోంచి లేవడానికి ఉద్యుక్తురాలవుతూన్న భారతికేసి చూసి లాంచనంగా పలికాడు ఆదిత్య.

''నిజానికి కాలేదు!''

హేట్ తీసి, భ్రుకుటి ముడిచి చూశాడు.

''ఆమెకి ఒక పరిష్కారం మిగిలే పోయింది.''

''రేపు విడుదల చేస్తున్నాం గదా!''

''అందుకే...ఆ తరవాత ఏమిటని?''

అర్థం కాలేదు భారతి ఆదిత్యకు.

''అన్నట్లు మీకో విషయం చెప్పాలి. ఇక్కడి కొన్నిన ఎవరైనా విడుదలవుతున్నామంటే వెర్రి ఆనంద పడతారు. కానీ ఎందుకో ఆమె ఆ మాట వింటేనే విపరీతంగా దుఃఖిస్తోంది. నిన్న రౌండ్స్ తిరుగుతూ చూశాను. ఎంత అనునయంగా చెప్పినా, ఊహుఁ— కంపించి పోతూన్నట్లు ఏడవడమే!''

''నిజమే. కన్నవాళ్ళ దగ్గిరికి వెళ్ళడానికి ఎలా మొహం చెల్లుతుంది? అసలు ఇక్కణ్ణించి బయట పడగానే ఆమెని డబ్బు పోసి కొన్నవాళ్ళు పోనిస్తారా? అసలు బతక నిస్తారా? పొంచి పొంచి వాళ్ళు దారి కాస్తూనే ఉంటారు. జరుగుతున్న అన్యాయాల్ని అక్రమాల్ని లోకం వెలుగులోకి తీసుకెళ్ళడమే పత్రికల తరఫున మేం చేయగలిగింది. మీరు అధికారాలు, బాధ్యతలు గల ప్రభుత్వ ప్రతినిధులు. మీ డిపార్టు మెంటుతో సంప్రదించి ఏదైనా రక్షణ కల్పించ డానికి, భద్రత కల భవిష్యత్తు ఏర్పరచడానికి మీరు గట్టి కృషి చెయ్యాలి. అది నా మనః పూర్వకమైన ప్రార్థనకూడా!'' చేతులు జోడించి సెలవు చెప్పి వెళ్ళిపోయింది జర్నలిస్ట్ భారతి.

తాను ఎంతోమందిని ఖైదు చేశాడు. విడుదల చేశాడు. ఇలాటి సమస్య తన ముందు ఎన్నడూ రాలేదు. భారతి మాటల్లో ఔచిత్యాన్ని ఆలోచిస్తూ కళ్ళు మూసుకుని రివాల్వింగ్ చెయిర్‌లో వెనక్కి వాలాడు జైలు సూపరింటెండెంట్.

టెలిఫోన్ మోగడంతో కళ్ళు తెరిచి ముందుకు వంగి రిసీవర్ తీశాడు.

''నేను కాదంబరిని, నాన్నా. తమ్ముడు గోల చేస్తున్నాడు. మీతో ఒకసారి మాట్లాడతాడట.''

''కన్నా అల్లరి చెయ్యకుండాఉంటే రేపు అమ్మని తీసుకొచ్చేస్తాను. అక్కయ్య చెప్పినట్టు వినాలి. రేపే! తప్పకుండా వచ్చేస్తుంది. అలాగే...అలాగే...చాకలెట్లు కూడా...''

రిసీవర్ యథాస్థానంలో ఉంచేసి, సెంట్రీని కేకేసి చేంబర్ బయటికి నడిచాడు ఆదిత్య.

• • • •

''జోసెవ్!''

''చిత్తం! అయ్యా, రమ్మని కబు రెట్టారట!''

డాబా మీద పడక కుర్చీలో వాలి తాపీగా సిగరెట్ కాలుస్తూన్న ఆదిత్యకు కొద్ది ఎడంగా చేతులు కట్టుకు నిలబడ్డాడు సెంట్రీ కానిస్టేబుల్ జోసెవ్.

''భోజనం చేశావా?''

మూడేళ్ళుగా పరిచయం జోసెవ్‌కి. సర్వ కాల సర్వావస్థల్లో ఆయన మొదటి పరామర్శ అది. డ్యూటీ లేనప్పుడు ఎప్పుడైనా చదరంగం ఆడ్డానికి, తనకి వీలు కుదరక పిల్లల్ని సినిమాలకి, పార్కులకి తీసుకెళ్ళడానికి, ఏదైనా పండగలు పబ్బాలు వచ్చిన ప్పుడు తనని ప్రత్యేకంగా పిలిపిస్తారాయన. తన సర్వీసులో రకరకాల అనుభవాలు చెబుతుంటారు. మళ్ళీ యూనిఫారమ్ వేసుకుంటే పులి!

కళ్ళతో, తలతో సమాధానం చెప్పాడు జోసెవ్.

''నువ్వు నా కో పని చేసి పెట్టాలి.''

సిగరెట్ ఆర్పి మూలకి విసిరేసి జోసెవ్ కేసి నిటారుగా చూశాడు ఆదిత్య.

''అయ్యా!''

''పన్నెండో నంబర్ సెల్‌లో ఖైదీ రేపే కదా

రిలీజ్ కావడం?''

"నిత్తం, అయ్యా!''

"జోసెఫ్!'' పడక కుర్చీలోంచి లేచి కొబ్బరి ఆకులు వాలుతూన్న పిట్ట గోడవైపు నడిచాడు ఆదిత్య. "మనింటికి తీసుకు రావాలనుకుంటున్నాను!'' చెప్పడం ఆపి, మెడ వంకించి చూశాడు జోసెఫ్ కేసి.

వినయం తప్ప జోసెఫ్‌కి మాట లేదు.

"మాట్లాడవేం, జోసెఫ్?!''

"నా దేం ఉందయ్యా? !''

"ఈ మాట చెప్పడానికి కాదోయ్, నిన్ను పిలిపించింది!''

"మంచీ చెడూ తమరి కంటే ఎక్కువ విచారించ గలనా, అయ్యా?!''

"వయసులో పెద్దవాడివి. కాని వడబోసిన జీవితానుభవం ఉన్నవాడివి.''

"ఖాకీ గుడ్డలు, పాదాల బూట్లు, లాఠీ కర్ర, ఎర్ర టోపీ తప్పమన పెక్కు ఉందయ్యా మాకు?''

కాస్సేపు మౌనం.

"నా మీద నాకు అభిప్రాయం కుదరక, దాని మీద విశ్వాసం నిలవక కాదు, జోసెఫ్! నిన్ను అడగడం. జీవితంలో దారుణమైన అపశ్రుతి పాల్పడిన ఆదిత్య అనే మనిషికి ఇంకా మరో మనిషి సలహా మీద గురి వచ్చి పోలేదు, జోసెఫ్!''

"అంత మాట అనకయ్యా. తమరు పూ: అంటే పర్మం పలికిస్తాడయ్యా ఈ జోసెఫ్.''

చేతులు వెనక్కి బిగించి, తల వూగిస్తూ సాలో వనగా చూశాడు ఆదిత్య జోసెఫ్ కేసి.

"తాను నాకేం కాగలదో, నేను తన కేమవుతానో నేనిప్పుడే ఏమీ చెప్పలేను. ఆమెకి, నాకు పది హేను సంవత్సరాల అంతరం ఉంది. కాలమూ, మనసూ కలిసి నిర్ణయించాల్సిన సంగతులివి. అయినా నా సమస్య అది కాదు. ముందు నా బిడ్డలకి మాతృత్వం చవిచూపించగల నిర్మలాంతః కరణ కావాలి. గుండెలో పొదువుకుని సాకే కడుపు తీపి కావాలి. శిథిలాలయం లాటి నా ఇంటో నిరంతరదీపం వెలిగించే చేతి చలువ కావాలి. వేళ కింత భోజనం పెట్టి, యోగక్షేమా లడిగే ఆప్త హృదయం కావాలి... చాలు, జోసెఫ్! ఈ జన్మ కది చాలు!...''

"అయ్యా! ఈ ఖాకీ దుస్తుల మాటున ఇంత దొడ్డ హృదయం నా పాతికేళ్ళ సర్వీసులో నే నెక్కడా ఎరగనయ్యా!''

జోసెఫ్ తడిసి ముద్దయ్యాడు.

"వంచన కాటేసే గుండె మంట వంచింప బడిన వాళ్ళే గుర్తించగలరు, జోసెఫ్!' స్వగతంగా తనలో తను గొణుక్కున్నాడు ఆదిత్య.

"తమరు దేవు...''

"జోసెఫ్!'' అరిచినంత పని చేశాడు ఆదిత్య.

"ఆపుకోలేక పోతున్నా, మన్నించయ్యా!''

● ● ● ●

"ఆపమ్మా సంగతి...''

విడుదలకు సంబంధించిన డిపార్ట్‌మెంట్ కాగితాల మీద చేవ్రాలు తీసుకుంటూ చెప్పడం ఆపి, ఒక్క క్షణం తలెత్తి చూశాడు సెంట్రీ ఇనిస్పెక్టర్ జోసెఫ్.

# యువత

## మీ సాహితీ సంపద

**నిర్వహణ : మంజుశ్రీ**

### గత సంచికలో ఇచ్చిన సాహితీ సంపద సమాధానాలు

1. పుట్టపర్తి నారాయణాచార్యులు.
2. గడియారం వేంకటశేషశాస్త్రి.
3. బొడ్డుపల్లె. ఏడువందల టంకాలు.
4. ప్రజ్ఞాప్రభాకరం.
5. శ్రీ శ్రీ, ఆరుద్రలు.
6. జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి. మాచిరాజు దేవీప్రసాద్.
7. నెల్లూరిని పాలించే మనుమసిద్ధ మహారాజు. మహాకవి తిక్కనను అర్థించాడు.
8. సులోచన. ఈమె ఇంద్రజిత్తు ఇల్లాలు.
9. అల్లసాని పెద్దనగారిని తెనాలి రామలింగం వేళాకోళం చేశాడని చాటు పద్యం.
10. రామాయణం.

### ప్రశ్నలు 16

1. కరుణశ్రీ అసలు పేరేమిటి?
2. పుష్పవిలాపాన్ని ఎవరు రచించారు? గ్రామఫోను రికార్డుగా ఎవరు పాడారు?
3. బుచ్చిబాబు రాసిన ఆత్మకథనం.
4. విభీషణుడి కూతురి పేరు? వాల్మీకంలో ఉంది! ఆమె పేరేమిటో, ఏ కాండలో వస్తుందో చెప్పండి?
5. కవి రాజహంస, కవికులాలంకార బిరుదులు ఏ కవుల కున్నాయి?
6. సన్యాసులు కాషాయవస్త్రాలు ధరించడంలో విశేషం ఏమిటి?
7. ఆంధ్ర శేషగిరిరావుగారు సుమారు పది సంవత్సరాలపాటు నిర్వహించిన తెలుగు పత్రిక?
8. తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రచురించే తెలుగు పత్రిక?
9. మైదానం అనే నవలను రచించిన వారు?
10. పండరిపురం ఏ రాష్ట్రంలో ఉంది?

**సమాధానాలు వచ్చే సంచికలో**

"నీకు మనఃపూర్తిగా ఇష్టమయితేనే. కాదను కుంటే నువ్వు మీ ఇంటికి వెళ్ళడానికి సురక్షితమైన ఏర్పాట్లు చేస్తారు. భయం, మొగమాటం వద్దు. నిశ్చయించుకుంటే పై ఆఫీసర్లతో మాట్లాడి విజిలెన్స్ హోమ్‌కి పంపించి...''

జోసెఫ్ మాటలు పూర్తి కాలేదు.

"భగవంతుడి స్వరూపం ఇంత గొప్పగా ఉంటుం దని ఎప్పుడూ ఊహించలేదండీ!...''

పూనకం వచ్చినదానిలా పట్టరాని ఆనందో ద్వేగంతో నుదులు తిరిగిపోతూ విరుచుకు పడి పోయింది పంకజం.

"ఈ బురద బతుక్కి...''

ఏడుపు, నవ్వు కలిసి — పెద్ద పెట్టున రొప్పుతూ రోజుతూ పాల్కు దణ్ణాలు పెట్టింది.

● ● ● ●

దీపాలవేళ...

ధూళి రేపుకుంటూ వచ్చి ఆగింది జీపు.

"కాదంబరీ!... ఈమె...''

"అమ్మ!''

తమ్ముణ్ణి చంకనేసుకుని సాదరంగా ఎదురెదు తూన్న కూతురుని చూసి విచలితుడయ్యాడు ఆదిత్య.

"జోసెఫ్!''

గుండె పట్టని కృతజ్ఞతతో, స్నేహార్ద్రతతో పెదిమలు మీసాల అడుగున బిగబట్టి, చేతులు రెండూ వెనక్కి విరిచి కట్టుకుని, నీరు చిప్పిలుతున్న కళ్ళతో అలవాటుగా తల కదిలిస్తూ గుమ్మంలోకి చూశాడు.

గడప కివతల ఒక వారగా దైవానికి ప్రార్థన ఆచరిస్తున్నాడు జోసెఫ్.

"ఈ ఖాకీ దుస్తులు అడ్డ మొస్తున్నాయిరా, ఫూల్!''

హేట్ తీసి చేరుమాలుతో కండ్లు తుడుచు కుంటూ పిల్లలకేసి మళ్ళబోయిన ఆదిత్య వెనక్కి తిరిగాడు ఫోన్ మోగడంతో.

ముక్కు ఎగబీలుస్తూ గంభీరంగా ఫోన్ మీంచి రిసీవర్ అందుకున్నాడు.

"మీ రిచ్చిన ముగింపు... కంగ్రాచ్యులేషన్స్!''

అది జర్నలిస్టు భారతి గొంతు. ★